ఈనాడు
నాగర్‌కర్నూల్
శుక్రవారం అక్టోబరు 25, 2024

చెకుముకి సైన్స్ సంబరాలకు సన్నాహాలు

- నవంబరు 7 నుంచి ప్రారంభం
- 8-10 తరగతుల విద్యార్థులు అర్హులు


పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులు

అచ్చంపేట, న్యూస్‌టుడే: విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసి ప్రోత్సహించేందుకు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా చెకుముకి సైన్స్ సంబరాలు నిర్వహిస్తున్నారు. తెలంగాణ సమగ్ర శిక్ష సహకారంతో అన్ని యాజమాన్యాల పరిధిలోని పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరంలో 8-10 తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులు. సైన్స్ పట్ల విద్యార్థులకు ఆసక్తిని పెంపొందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్రస్థాయిలో విద్యార్థులకు ప్రతిభ పరీక్షలో పాల్గొనేందుకు అవకాశం కల్పించారు.

పోటీల వివరాలు ఇలా : విద్యార్థులకు మొదట పాఠశాల స్థాయిలో ప్రతిభ పరీక్ష నిర్వహించనున్నారు. నవంబరు 7న పాఠశాల స్థాయి, 21న మండల స్థాయి, 28న జిల్లా స్థాయిలో పోటీలు నిర్వహించనున్నారు. రాష్ట్ర స్థాయి పోటీలు ఆదిలాబాద్‌లో డిసెంబరు 14-16 వరకు నిర్వహించనున్నారు. 8, 9, 10 తరగతులకు సంబంధించిన సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం, సమకాలీన శాస్త్ర, సాంకేతిక అంశాలపై పోటీలుంటాయి. వీటిని తెలుగు, ఆంగ్ల మాధ్యమాల్లో నిర్వహించనున్నారు. పాఠశాల స్థాయిలో ప్రతిభ చాటిన విద్యార్థులకు మండల స్థాయిలో పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేస్తారు. అన్ని మండలాల విజేతలకు జిల్లాస్థాయిలో పోటీలు నిర్వహించి ఆయా జిల్లాల నుంచి ఎంపికైన విజేతలకు రాష్ట్రస్థాయికి పంపుతారు. ఈ పోటీలుంటాయి. ప్రధానోపాధ్యాయుల ద్వారా ఈ పోటీల్లో పాల్గొనేందుకు విద్యార్థులు పేర్లు నమోదు చేసుకోవాలి. ఉమ్మడి జిల్లాలోని అన్ని యాజమాన్యాల పరిధిలోని 8-10 తరగతులు చదువుతున్న విద్యార్థులు చెకుముకి సైన్స్

రాష్ట్ర స్థాయిలో..

చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. రాష్ట్రస్థాయిలో సైన్స్ ప్రయోగాలు, సైన్స్ జాతర, మీట్ ది సైంటిస్ట్, సైన్స్ ఎగ్జిబిషన్, పుస్తక ప్రదర్శన కార్యక్రమాలు నిర్వహించి విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని జేవీవీ జిల్లా ప్రతినిధి బాల్‌రాం తెలిపారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులు పాల్గొనేలా సైన్స్ ఉపాధ్యాయులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు.

నిర్వాసితులను ఆదుకుంటాం : కలెక్టర్

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో ముంపునకు గురవుతున్న నిర్వాసితులను ఆదుకుంటామని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. ముంపు గ్రామాలైన అంజనగిరి, ధూల్యానాయక్‌తాండ, వడ్డే గుడిసెలు, బోడబండతండాలను గురువారం ఆయన సందర్శించారు. ప్యాకేజీ విషయంలో మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు గ్రామాలను సందర్శించినట్లు వివరించారు. పునరావాసానికి కావాల్సిన సదుపాయాలు, పరిహారం తదితర అంశాలపై గ్రామస్థులతో చర్చించారు. పాఠశాల, ఆసుపత్రి, సీసీ రోడ్లు, భూగర్భ మురుగు కాల్వలు, కమ్యూనిటిహాల్‌తో పాటు అన్ని సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శ్రీశైలం తిరుగు జలాల్లో ఎర్రగట్టు బొల్లారంలో ముంపునకు గురైన 64 కుటుంబాలు గ్రామంలో ఇళ్లు నిర్మించుకోవడానికి అటవీశాఖ నుంచి ఇబ్బందులు రాకుండా చూడాలని, నివాస స్థలాలకు పట్టాలు ఇవ్వాలని ప్రజలు కోరారు. సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పాలనాధికారి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్డీవో యాదగిరి, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రావు, హనుమంత్‌నాయక్, బాలయ్య, శేఖర్‌రెడ్డి, స్వామి తదితరులు పాల్గొన్నారు.


ముంపు ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సంతోష్

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయండి

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై క్షేత్రస్థాయి పరిశీలన ప్రక్రియ వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో పురపాలక, నీటిపారుదల, రెవెన్యూ, పంచాయతీ శాఖల అధికారులతో గురువారం ఎల్ఆర్ఎస్ దరఖాస్తులపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ... దరఖాస్తుల పరిష్కారానికి మండలాల వారీగా తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. క్షేత్రస్థాయి పరిశీలనను నాలుగు దశల్లో పూర్తి చేయాలని సూచించారు. క్రమబద్ధీకరణకు సంబంధించిన రుసుము త్వరగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట పట్టణాల్లో 44,054, గ్రామీణ ప్రాంతాల నుంచి 23,255 దరఖాస్తులు వచ్చాయన్నారు. అదనపు కలెక్టర్ దేవసహాయం, డీపీవో రామ్మోహన్‌రావు, నీటిపారుదల శాఖ ఈఈ మురళి, కమిషనర్లు, గ్రామ కార్యదర్శులు పాల్గొన్నారు.

మొక్కజొన్న క్వింటాలు రూ.2,395

నాగర్‌కర్నూల్, న్యూస్‌టుడే : నాగర్‌కర్నూల్ మార్కెట్ యార్డులో గురువారం మొక్కజొన్న క్వింటాలు ధర రూ. 2,395 పలికింది. మార్కెట్‌కు 1,032 క్వింటాళ్ల మొక్కజొన్న ధాన్యం వచ్చింది. కొద్ది రోజులుగా క్వింటాలు రూ. 1,800 నుంచి రూ. 2360 వరకు ఉండగా.. తాజాగా రూ. 2395 పలికింది.

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట వ్యవసాయ మార్కెట్‌లో మొక్కజొన్న క్రయవిక్రయాలు కొనసాగుతున్నాయి. గురువారం 23 మంది రైతులు 299.50 క్వింటాళ్ల (599 బస్తాలు) ధాన్యం తెచ్చారు. క్వింటా గరిష్ఠ ధర రూ. 2,353, మాదిరి ధర రూ. 2,146, కనిష్ఠ ధర రూ. 1,419 చొప్పున వ్యాపారులు కొనుగోలు చేశారని మార్కెట్ కార్యదర్శి నరసింహులు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యం..
తరలుతున్న పత్తి

- పూర్తిస్థాయిలో ఏర్పాటు కాని కొనుగోలు కేంద్రాలు
- తక్కువకు కొంటున్న దళారులు, కర్ణాటక వర్తకులు

న్యూస్‌టుడే- కోస్గి, ఉండవల్లి : పత్తి పంటపై రైతులు పెట్టుకున్న ఆశలను వర్షాలు దెబ్బతీశాయి. ఉన్న పంటను అమ్ముకుందామంటే కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికార యంత్రాంగం మీనమేషాలు లెక్కిస్తోంది. ఫలితంగా దళారులకు తెగనమ్ముకుంటున్నారు. పెద్ద ఎత్తున పంట కర్ణాటకకు తరలిపోతోంది. కొందరు రైతులు పత్తి తీసి ఇళ్లలో నిల్వ చేశారు. వరుసగా కురుస్తున్న వర్షాలతో పత్తి నాని ఇబ్బందులు పడుతున్నారు. భారతీయ పత్తి సంస్థ (సీసీఐ) ఆధ్వర్యంలో మార్కెటింగ్ అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుకు సిద్ధమయినా, నేటికీ అందుబాటులోకి రాకపోవడంతో అన్నదాతలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. వరుసగా వర్షాలు కురుస్తుండడంతో తేమశాతం పెరుగుతుందని, అందుకే అధికారులు వెనకడుగు వేస్తున్నారని రైతుసంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు


ఉండవల్లి: సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు కోసం అధికారులు పరిశీలించిన పత్తిమిల్లు

కర్షకుల నిరసనలు: ధన్వాడలో పత్తి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ధర్నా నిర్వహించారు. ఉమ్మడి జిల్లాలో పలు చోట్ల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఉండవల్లి శివారులోని జాతీయ రహదారి పక్కనున్న పత్తి మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. నారాయణపేట జిల్లాలో జిన్నింగ్ మిల్లులకు కొందరు తరలిస్తున్నారు. నారాయణపేట, గద్వాల జిల్లాల్లోని సరహద్దు ప్రాంతాల్లో కర్ణాటక దళారులు పంటను తరలిస్తున్నారు. కోస్గి, మద్దూరు, గుండీడ్ మండల రైతులు వికారాబాద్ జిల్లా తాండూరులో విక్రయిస్తున్నారు. అలంపూర్ నియోజకవర్గంలో జిన్నింగ్ మిల్లులు ఉన్నప్పటికీ వాటిని ఆలస్యంగా ప్రారంభిస్తుండడంతో దళారులు రంగప్రవేశంచేసి తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..

జిల్లా	2022	2023	2024
మహబూబ్‌నగర్	1,15,380	85,830	79,128
నారాయణపేట	2,05,807	1,84,597	1,85,150
నాగర్‌కర్నూల్	3,52,429	2,35,530	2,10,970
వనపర్తి	21,689	17,411	12,301
జోగులాంబ గద్వాల	2,22,908	1,44,075	1,20,597

ఉమ్మడి జిల్లాలో సాగు ఇలా..: ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో 5.88 లక్షల ఎకరాలలో పత్తి సాగు అయ్యింది. గత ఏడాది కన్నా కొంత తగ్గింది. 41.19 లక్షల కింటాళ్ల పత్తి దిగుబడి ఉంటుందని వ్యవసాయ అధికారులు అంచనా వేస్తున్నారు. కొనుగోలు కేంద్రానికి వచ్చే పత్తి తేమశాతం 8 నుంచి 12 లోపు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని గతంలో అధికారులు సూచించారు.

తక్కువ ధరకు అమ్ముకున్నా..

ఈ ఏడాది 9 ఎకరాల్లో పత్తి పంటను సాగుచేశాను. సుమారు 70 క్వింటాళ్ల పత్తి వచ్చింది. క్వింటా రూ. 6,150 చొప్పున గ్రామంలోనే వ్యాపారులకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకన్నా తక్కువకు విక్రయించాను. సీసీఐ కొనుగోలు కేంద్రం ఉంటే క్వింటాకు కనీసం రూ. వెయ్యి అదనంగా వచ్చేది. నాకన్నా తక్కువ అమ్ముకునేవారూ ఉన్నారు. రైతుల వేదన అధికారులు ఆలకించాలి.


- చిన్న మద్దిలేటి, రైతు, చెన్నిపాడు

ఉన్నతాధికారులకు నివేదించాం..: సీసీఐ కేంద్రం ఏర్పాటు గురించి అలంపూర్ మార్కెట్ కమిటీ ఛైర్మన్ దొడ్డెన్న, వైస్ ఛైర్మన్ కొమ్ముకుమార్, ఉన్నతాధికారులతో చర్చించానని, దీపావళి తర్వాత కేంద్రం ఏర్పాటయ్యే అవకాశాలున్నట్లు అలంపూర్ మార్కెట్ యార్డు కార్యదర్శి యల్లాస్వామి అన్నారు.

మత్స్యకారుల ఉపాధికి గండి

దళారులతో చేపలు పట్టిస్తున్న సంఘాల నాయకులు


సింగోటం సమీపంలో చేపలవేట (పాతచిత్రం)

అచ్చంపేట న్యూటౌన్, న్యూస్‌టుడే: చేప పిల్లల పంపిణీ, పెంపకంలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. మత్స్యకారుల ఉపాధి కోసం ప్రభుత్వం ఏటా చెరువుల్లో చేప పిల్లలను విడుదల చేస్తుంది. వాటిని సంరక్షించాల్సిన సహకార సంఘాల నాయకులు దళారులతో ఒప్పందాలు చేసుకుంటున్నారు. వారితోనే చేపలు పట్టిస్తూ మత్స్యకారుల ఉపాధికి గండి కొడుతున్నారు.

కేసరి సముద్రంలో.. : జిల్లా కేంద్రం సమీపంలోని కేసరి సముద్రానికి చెందిన సహకార సంఘాలు దళారులతో చేతులు కలపడంతో ఈ వృత్తిపైనే ఆధారపడిన మత్స్యకారులు జీవనోపాధికి దూరమవుతున్నారు. సంఘాల్లోని కొందరు నాయకులు కోల్‌కతాకు చెందిన వ్యాపారులతో అక్రమ వ్యాపారానికి తెరలేపారు. వీళ్ల పడవల్లో ఛార్జింగ్ బ్యాటరీలను ఏర్పాటు చేసుకుని విద్యుత్తు షాక్‌తో చేపలు పడుతున్నారు. మత్స్యకారులు ఇదేమిటని ప్రశ్నిస్తే.. తామే చేపలు పడతామని చెబుతున్నారు. చెరువుల్లోకి వెళ్లిన మత్స్యకారులపై కేసులు పెట్టిన ఘటన ఇటీవల ఉయ్యాలవాడలో చోటుచేసుకుంది. ఉప్పునుంతల మండలం లక్ష్మాపూర్‌లోనూ చేపల పెంపకంలో అక్రమ వ్యాపారం జరుగుతుందనే ఆరోపణలున్నాయి.

పెంపకం ప్రశ్నార్థకం...

అధికారుల నిర్లక్ష్యం వల్ల అచ్చంపేట మండలం చంద్రసాగర్ చెరువులో ఐదేళ్లగా చేప పిల్లల పెంపకం ప్రశ్నార్థకంగా మారింది. ఏటా సుమారు 10 లక్షల చేప పిల్లలను పెంచి, ఉత్పత్తి చేయాల్సిన సంరక్షణ కేంద్రం ఇక్కడ ఉంది. సంబంధిత అధికారి పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారింది. మరోవైపు ఆయన అనధికారికంగా సెలవులో ఉన్నారని సమాచారం. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినట్లు తెలిసింది.

జిల్లాలో చెరువులు	:	1,448
సహకార సంఘాలు	:	235
మత్స్యకారులు	:	18,600
చేప పిల్లల పెంపకం లక్ష్యం	:	1.50 కోట్లు
చేప పిల్లను వేసిన చెరువులు	:	273
వేసిన చేప పిల్లలు	:	25.12 లక్షలు

- కొన్ని గ్రామాల్లో మత్స్యకారుల్లో సమన్వయం లేదు. చేప పిల్లల నాణ్యతను సంబంధిత వైద్యుడు పరిశీలించాలని, లేకుంటే చెరువుల్లో విడుదల చేసేది లేదని అడ్డుకుంటున్నారు. మత్స్యశాఖ సిబ్బంది చెప్పినా.. నాగర్‌కర్నూల్, కల్వకుర్తి డివిజన్లలోని సంఘాల సభ్యులు ఇష్టారీతిన వ్యవహరిస్తుండటంతో వృత్తిపైనే ఆధారపడిన మత్స్యకారుల ఉపాధికి గండి పడుతోంది. ఈ నెలాఖరు వరకు లక్ష్యాలను చేరుకునేలా చర్యలు చేపడతాం.

-రజిని, మత్స్యశాఖ ఏడీ, నాగర్‌కర్నూల్

స్థానిక పోరుకు ముమ్మర ఏర్పాట్లు

జిల్లాలకు చేరిన కరదీపికలు

మహబూబ్‌నగర్ పట్టణం, న్యూస్‌టుడే : గ్రామ పంచాయతీ పాలకవర్గాలు, జడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యుల పదవీ కాలం ముగిసింది. ప్రస్తుతం గ్రామ పంచాయతీ, జిల్లా పరిషత్తులు, మండల పరిషత్తుల్లో ప్రత్యేక అధికారుల పాలనలో ఉన్నాయి. ఆయా స్థానిక సంస్థలకు ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న విషయంపై స్పష్టత లేకపోయినా అధికారులు ఎప్పుడు ఎన్నికల తేదీలని ప్రకటించినా నిర్వహించేందుకు వీలుగా ఏర్పాట్లలో తలమునకలయ్యారు. బ్యాలెట్ పెట్టెలను సరిచూసుకోవాలని ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లాల వారిగా బ్యాలెట్ పెట్టెల ఆవశ్యకత, మరమ్మతులు చేసేవి ఎన్ని అనే వివరాలను అధికారులు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల శిక్షణకు సంబంధించిన మాడ్యుల్స్, ప్రిసైడింగ్, రిటర్నింగ్ అధికారులకు సంబంధించిన కరదీపికలు జిల్లాలకు చేరాయి. వాటితో పాటు వివిధ రకాల ఫారాలు కూడా వచ్చాయి.


మహబూబ్‌నగర్ జిల్లా పంచాయతీ అధికారి కార్యాలయానికి చేరిన ఎన్నికల మాడ్యుల్స్, కరదీపికలు

నాలుగు జిల్లాల్లో 6 కొత్త మండలాలు.. : ఉమ్మడి పాలమూరులోని నాలుగు జిల్లాల్లో కొత్తగా మండలాలు ఏర్పడ్డాయి. ఈసారి జడ్పీటీసీ, ఎంపీపీ ఎన్నికల్లో వీటిని పరిగణలోకి తీసుకుని మండల ప్రాదేశిక స్థానాలను పునర్విభజన చేయనున్నట్లు సమాచారం. తద్వారా రిజర్వేషన్లు కూడా మారనున్నాయి. జిల్లాలకు ఎన్నికల సామగ్రి చేరుతున్న నేపథ్యంలో బ్యాలెట్ పత్రాలు రావాల్సి ఉంది. మహబూబ్‌నగర్ జిల్లాలో కొత్తగా మహ్మదాబాద్, కౌకుంట్ల మండలాలు ఏర్పడ్డాయి. వనపర్తి జిల్లాలో ఏదుల, జోగులాంబ గద్వాల జిల్లాలో ఎర్రవల్లి, నారాయణపేట జిల్లాలో గుండుమాల్, కొత్తపల్లి ఇలా మొత్తం 6 కొత్త మండలాలు ఏర్పడ్డాయి. ఆయా ప్రాంతాల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ స్థానాలు పెరిగే ఆస్కారం ఉంది.

గోదాముల్లో ఎన్నికల సామగ్రి

ఉమ్మడి జిల్లాలో 1,700 పంచాయతీలు, 15,276 వార్డులు ఉన్నాయి. వచ్చే ఎన్నికల్లో వార్డుల సంఖ్య పెరగడంతో పాటు ప్రతి వార్డుకు ఒక బ్యాలెట్ పెట్టె అవసరం కానుంది. ఈ లెక్కన గతంలో మాదిరిగానే మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. మొదటి విడతలో ఉపయోగించిన బ్యాలెట్ పెట్టెలను తిరిగి రెండో, మూడో విడత ఎన్నికల్లోనూ ఉపయోగించుకోవచ్చు. విధులు నిర్వహించే సిబ్బంది శిక్షణకు అవసరమైన పుస్తకాలు, సామగ్రి చేరుకోవడంతో వాటిని గోదాముల్లో భద్రపరిచారు.

ఉమ్మడి జిల్లాలోని పంచాయతీలు, వార్డులు, ఎంపీటీసీలు, జడ్పీటీసీలు, ఎంపీపీల సంఖ్య, ఓటర్ల వివరాలు ఇలా..

జిల్లా	పంచాయతీలు	ఎంపీటీసీలు	జడ్పీటీసీలు	ఎంపీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు
మహబూబ్‌నగర్	441	168	16	16	3,836	2,57,529	2,58,647
నాగర్‌కర్నూల్	464	212	20	20	4,140	3,23,705	3,22,689
వనపర్తి	260	128	15	15	2,366	1,83,382	1,84,135
జోగులాంబ గద్వాల	255	141	13	13	2,390	1,91,313	1,96,875
నారాయణపేట	280	147	13	13	2,544	1,98,199	2,05,547

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పోలింగ్ కేంద్రాలను అధికారులు పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న కేంద్రాలు, వాటిలో సమస్యలు, కొత్తగా ప్రతిపాదించే కేంద్రాల్లో సమస్యలున్నాయా అనే దానిపై మండలాల వారీగా ఏర్పాటు చేసిన కమిటీలు పరిశీలించి ఇప్పటికే నివేదికను సమర్పించాయి. కొత్తగా మరికొన్ని పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసే అవకాశముంది. ప్రభుత్వం కులగణనకు ఆదేశాలు జారీ చేయడం, దీనికి రెండు నెలలు గడవు ఇవ్వడంతో ఈ ఏడాదికి ఎన్నికలు లేనట్టేనని అధికారులు భావిస్తున్నారు. కులగణన పూర్తి చేసిన తర్వాత గత రిజర్వేషన్లను రద్దు చేసి కొత్తగా రిజర్వేషన్లను ప్రకటించి ఎన్నికలు నిర్వహించాలనే డిమాండ్ ఉంది. ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయకపోవటంతో ఉత్కంఠ నెలకొంది.

నేడు డయల్ యువర్ డీఎం

కల్వకుర్తి, న్యూస్‌టుడే: కల్వకుర్తి డిపో పరిధిలో నెలకొన్న సమస్యలు, పరిష్కార మార్గం చూపడానికి శుక్రవారం డయల్ యువర్ డీఎం ఏర్పాటు చేసినట్లు మేనేజర్ సుభాషిణి తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 1 గంట వరకు జరిగే కార్యక్రమంలో ప్రజలు సమస్యలను తమ దృష్టికి తీసుకు రావడానికి చరవాణి 99592 26292కు ఫోన్ చేయాలని కోరారు.

శ్రీశైలంలో 4 గేట్ల ద్వారా నీటి విడుదల


దిగువకు విడుదలవుతున్న నీరు

శ్రీశైలం ప్రాజెక్టు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : ఎగువ ప్రాంతాల నుంచి నీటి ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయం పూర్తిగా నిండింది. గురువారం 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 1,12,300 క్యూసెక్కులు, కుడి, ఎడమ విద్యుత్తు కేంద్రాల ద్వారా 67,876 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సాయంత్రం 6 గంటలకు 885 అడుగుల (212.387 టీఎంసీలు)గా నమోదైనట్లు అధికారులు తెలిపారు. జూరాల ప్రాజెక్టు నుంచి 70,552 క్యూసెక్కులు, సుంకేసుల నుంచి 1,18,776 క్యూసెక్కుల వరద నీరు జలాశయానికి చేరుతోంది.

పరిష్కారం కాని సాంకేతిక సమస్య

నాలుగో రోజూ మార్కెట్‌లో పంటల టెండర్లకు ఇబ్బందులు

జడ్చర్ల, న్యూస్‌టుడే : సాంకేతిక సమస్య వల్ల నాలుగో రోజు కూడా వ్యవసాయ మార్కెట్లలో ఈ-నామ్ పద్ధతిలో టెండర్ల ప్రక్రియ జరగలేదు. ఉమ్మడి జిల్లాలోని వ్యవసాయ మార్కెట్లతో పాటు బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో గురువారం మ్యానువల్‌గా అధికారులు టెండర్ల ప్రక్రియ చేపట్టారు. 'ఇ-నామ్‌కు సాంకేతిక సంకటం' అనే శీర్షికతో 'ఈనాడు'లో కథనం ప్రచురితమైన విషయం పాఠకులకు విదితమే. ఈ విషయంపై రాష్ట్రవ్యాప్త మార్కెట్లలో అధికారులు, వ్యాపారులు, రైతుల్లో చర్చ కొనసాగింది. మార్కెట్ కార్యదర్శులు, జిల్లా మార్కెటింగ్ అధికారులు సమస్యను పరిష్కరించాలని ఉన్నత అధికారులకు లేఖలు రాశారు. సాంకేతిక సమస్య ఇంకా పరిష్కారం కాలేదని, జిల్లాలోని ఈ-నామ్ మార్కెట్లలో సాధారణ టెండర్ల ప్రక్రియతోనే పంట కొనుగోళ్లు చేపట్టినట్టు జిల్లా మార్కెటింగ్ అధికారి బాలమణి తెలిపారు.

చేదెక్కుతున్న చెరకు

ప్రత్యామ్నాయం వెతుకుతున్న రైతులు



కొత్తకోట, న్యూస్‌టుడే: అందరికీ(చక్కెర) తీపిని అందించే చెరకు రైతులు మద్దతు ధర లభించక, చేసిన వ్యవసాయంలో వచ్చిందంతా అప్పులు చెల్లించేందుకే సరిపోయి కుదేలవుతున్నారు. ఏటా పెరుగుతున్న విత్తనాల ధరలు, ఎరువులు, కూలీల వేతనాలు పెట్టుబడులు గణనీయంగా పెరిగాయి. సరైన దిగుబడులు లేక, చేతికొచ్చిన పంటకు మద్దతు ధర లేక కర్షకులకు కష్టాలే మిగులుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరకును మరిచి ఇతర పంటలకు మద్దతు ధర పెంచడం, బోనస్‌లు ఇవ్వడం వారిని పంట మార్పిడి వైపు చూసేలా చేస్తోంది.


తగ్గుతున్న సాగు విస్తీర్ణం : ఉమ్మడి జిల్లాలో ఉన్న కృష్ణవేణి చక్కెర కర్మాగారం పరిధిలో ఏడేళ్ల క్రితం ఆరు వేల మంది రైతులు 15 వేల ఎకరాల్లో చెరకు సాగు చేసేవారు. ప్రస్తుతం వీరి సంఖ్య గణనీయంగా పడిపోయింది. ఉమ్మడి జిల్లానే కాకుండా పొరుగు జిల్లాలైన రంగారెడ్డి, వికారాబాద్ నుంచి కూడా చెరకు రైతులు ఉన్నారు. గతేడాది 5,950 ఎకరాల్లో చెరకు సాగు చేశారు. దాదాపు 2 వేల మంది ఈ పంట సాగు చేస్తుండగా యాజమాన్యం నుంచి తగిన ప్రోత్సాహం ఉండటం లేదని రైతులు పెదవి విరుస్తున్నారు. ఒక్క సారి విత్తనాలు వేస్తే నాలుగేళ్ల పంట వస్తుంది. తొలి ఏడాది అధిక పెట్టుబడులున్నా తర్వాత ఏడాది పెట్టుబడి సమస్యలు అంతగా ఉండవని సాగులోకి దిగిన రైతులు ఏటి కేడాది ఇక చాలు అని చెరకు సాగుకు దూరమవుతున్నారు. ప్రస్తుతం రైతులకు రికవరీ రేటు ఆధారంగా రూ. 3,340 మద్దతు ధర చెల్లిస్తున్నా అనేక కొర్రీలతో వారికి చేరే సరికి ఏమీ మిగలడం లేదని వాపోతున్నారు.

ఖర్చు రూ.లక్ష పైమాటే : ఎకరా చెరకు సాగు చేయాలంటే పెట్టుబడులన్నీ కలిపి తొలి ఏడాది రూ. లక్ష ఖర్చు చేయాల్సి ఉంటుందని కర్షకులు చెబుతున్నారు. గతేడాది కోత, రవాణా ఖర్చు టన్నుకు రూ. 1,100 చెల్లించాల్సి వచ్చింది. ఒక్కో ఎకరాకు సరాసరి 30 టన్నుల చెరకు పండుతుంది. ప్రస్తుత ధరతో పోలిస్తే రైతుకు రూ. లక్ష వస్తోంది. వీటిలో కోత, రవాణా ఖర్చులు మినహాయిస్తే మిగిలేది రూ. 77 వేలన్నమాట. ఏడాది పంట కోసం ఎరువులు, ఇతర పెట్టుబడులు అప్పుగా తేవాల్సిందే. అందుకు వడ్డీ చెల్లించాలి. ఇలా చెల్లింపుల్లో రవాణా కోత ఖర్చులు పోతే మిగిలింది ఎరువులు, ఇతర పెట్టుబడులకే సరిపోవడం లేదు. ఇక కౌలు రైతు పరిస్థితి మరీ దారుణం ఎకరాకు రూ. 15 వేలు కౌలు చెల్లించాల్సి ఉంటుంది. ఇలా రైతుకు ఎక్కడికక్కడ నష్టం వాటిల్లుతున్న తరుణంలో ఇతర పంటల సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

- స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు కనీస మద్దతు ధర రూ. 5,600 ఇవ్వాల్సి ఉంది. రికవరీతో సంబంధం లేకుండా కోత, రవాణా ఖర్చులు పోను రూ. 3,500 చెల్లించాలన్నది యాజమాన్యాలు అంగీకరించకుంటే వచ్చే ఏడాది సాగు మరింత తగ్గుతుంది. బోనస్‌ను పరిగణలోకి తీసుకుంటే వరి సాగు లాభసాటిగా ఉంది. పత్తి, వేరుసెనగ, ఆముదం వంటి పంటలు వేసుకున్నా లాభపడొచ్చు.


-రాజన్న, ఉమ్మడి జిల్లా చెరకు రైతు సంఘం అధ్యక్షుడు





(c) eenadu

విద్యుత్తు శాఖా మేలుకో..



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చాలా గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, తీగల పరిస్థితి ఘోరంగా ఉంది. ఏ మాత్రం గాలివీచినా తీగలు తెగి ప్రమాదాలకు తావిచ్చేలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా ఊట్కూరు మండలం తిప్రాసుపల్లిలో ఓ రైతు పొలంలో కనిపించిన చిత్రమిది. విద్యుత్తు స్తంభాల మధ్య దూరం ఎక్కువగా ఉండటంతో కర్రలు దన్నుగా ఉంచి తీగలు వేలాడకుండా ఆ రైతు ఏర్పాటు చేసుకున్నారు.

- న్యూస్‌టుడే, నారాయణపేట

భిన్న రీతిలో ఫ్లెక్సీలు



టైరోడ్ వద్ద గురువారం మధ్యాహ్నం ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

కృష్ణా, న్యూస్‌టుడే: ఏడాది క్రితం తమ కుమార్తె విజయలక్ష్మి ఆత్మహత్య చేసుకుంది. అందుకు అల్లుడు, అత్తమామలే కారణమని నారాయణపేట జిల్లా కృష్ణా మండలం గుడేబల్లూరుకు చెందిన చెన్నయ్యగౌడ్ ఆరోపించారు. నిందితుల ఆచూకీ తెలియచేయాలని కోరుతూ వివిధ రీతిలో కృష్ణా మండలం టైరోడ్, మక్తల్, మరికల్, మహబూబ్‌నగర్‌లలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. గత ఏడాది కర్ణాటక రాష్ట్రంలోని సేడం తాలూకా శంకరపల్లిలో తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడగా అక్కడి పోలీసులు కేసు నమోదు చేసినా పట్టించుకోలేదని తెలిపారు. అత్తమామల గ్రామం వదిలి వెళ్లిపోయారని తెలిపారు. వివాహ సమయంలో తమ కుమార్తెకు ఇచ్చిన కట్నకానుకలు తిరిగి ఇప్పించాలని చెప్పి ఇప్పుడు కనిపించకుండా పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమె కోసం తెలంగాణ, కర్ణాటకలో వెయ్యి బ్యానర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

వైభవంగా సీతారాముల కల్యాణం



సీతారాముల కల్యాణం జరిపిస్తున్న పండితులు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: పవిత్ర పుణ్యక్షేత్రమైన బీచుపల్లిలో గురువారం సీతారాముల కల్యాణాన్ని వైభవంగా జరిపించారు. స్వామి జన్మనక్షత్రమైన పునర్వసును పురస్కరించుకుని కోదండ రామాలయంలో కల్యాణోత్సవం ఏర్పాటు చేశారు. తిలకించేందుకు భక్తులు జిల్లా నలుమూలల నుంచి బీచుపల్లికి తరలివచ్చారు. ఆలయ పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్తుల కోలాహలం, భాజాభజంత్రీల నడుమ కల్యాణం కమనీయంగా జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ మేనేజర్ సురేందర్ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

చక్కని జీవన శైలితోనే ఆరోగ్యం పదిలం

● మధుమేహం, గుండె, ఈఎన్‌టీ సమస్యలపై వైద్యుల సూచనలు

ఈనాడు ఈటీవీ తెలంగాణ అవగాహన సదస్సుకు అనూహ్య స్పందన



ఆరోగ్య అవగాహన సదస్సుకు హాజరైన జనం

న్యూస్‌టుడే, పాలమూరు : అప్రమత్తత, చక్కని జీవన శైలితోనే వ్యాధులకు దూరంగా ఉంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని వైద్య నిపుణులు తెలిపారు. మహబూబ్‌నగర్‌లోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో 'ఈనాడు - ఈటీవీ' ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు సీనియర్ సిటిజన్లు, మహిళలు, యువత ఇలా.. అన్ని వర్గాల నుంచి అనూహ్య స్పందన లభించింది. చెవి, ముక్కు, గొంతు సంబంధ వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహబూబ్‌నగర్ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా.సంపత్‌కుమార్ సింగ్, మధుమేహం, ఇతర అనారోగ్యాలపై ప్రముఖ ఫిజీషియన్ డా.శ్రీనివాస్‌రెడ్డి, గుండె జబ్బులపై కార్డియాలజిస్ట్ డా.మహేశ్‌బాబు అవగాహన కల్పించటంతో పాటు సందేహాలు నివృత్తి చేశారు. చాలా ఏళ్లుగా మధుమేహంతో బాధపడుతున్న తాము ఇన్సులిన్ తీసుకుంటున్నామని, ఇది ప్రమాదకరమా అని కొందరు అడగగా అదేమీ కాదని, మాత్రల కంటే ఇదే నయమని వైద్యులు తెలిపారు. నిద్ర సమస్య ఉందని కొందరు చెప్పగా తగినంత శారీరక శ్రమ ఉంటే తప్పక నిద్ర వస్తుందన్నారు. ఐదేళ్ల నుంచి గొంతు కింద పెద్ద గడ్డతో బాధపడుతున్నానని ఒకరు చెప్పగా జనరల్ ఆసుపత్రికి వస్తే చికిత్సలు అందిస్తామన్నారు. అనారోగ్యం వచ్చినప్పుడు వైద్యులను సంప్రదించకుండా నేరుగా మాత్రలు కొన్కుకుని, సామాజిక మాధ్యమాల్లో దొరికే సమాచారంతో సొంత వైద్యం చేసుకోవద్దని, ఇది చాలా ప్రమాదకరమని హెచ్చరించారు. ఉరుకులు, పరుగుల జీవితంలో ఆరోగ్యాన్ని కాపాడుకునేందుకు ప్రతి ఒక్కరూ రోజూ 6 నుంచి 7 గంటలు నిద్ర పోవటంతో పాటు గంట పాటు వ్యాయామం చేయాలని, పోషకాహారం తీసుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండటం, ఒత్తిడి లేకుండా జీవించడం అవసరమని తెలిపారు.

పిండి పదార్థాలు తక్కువ తీసుకోవాలి



ప్రపంచంలోనే అత్యధిక మధుమేహం (డయాబెటిక్) బాధితులతో ఈ వ్యాధికి భారత్ రాజధానిగా మారింది. కార్బోహైడ్రేట్లు (పిండి పదార్థాలు) ఎక్కువగా ఉండే తెల్ల అన్నం, దంపుడు ఆహారంగా తీసుకునే అలవాటు ఉండటమే కారణం. గతంలో 40 ఏళ్ల తర్వాత ఈ వ్యాధి వచ్చేది. ఇప్పుడు 25 ఏళ్ల వారికి కూడా టైప్-2 వ్యాధి వస్తోంది. ఒత్తిడి, మానసిక సమస్యలతో సతమతం కావటం, కీళ్లు, ఇతర నొప్పుల మందులు, స్టెరాయిడ్ ఎక్కువగా వాడటం వల్ల కూడా వ్యాధి బారిన పడుతున్నారు. మధుమేహం వల్ల కంటి రెటీనా కూడా దెబ్బతింటుంది. గుండె, మూత్రపిండాలు, కాలేయం, నరాల బలహీనతలు, మంటల తదితర సమస్యలు వస్తాయి. ఇన్ఫెక్షన్లు సోకుతాయి. మధుమేహం తీవ్రత ఎక్కువగా ఉన్నవారు ఇన్సులిన్ తీసుకోవాలి. ప్రతి ఆరు నెలలకు ఒకసారి రక్త పరీక్షలు చేయించుకుంటూ ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలి. కార్బోహైడ్రేట్లు ఉండే ఆహారం చాలా తక్కువగా తినాలి. మద్యం, ధూమపానానికి దూరంగా ఉండాలి. ఆరోగ్యం కోసం, మధుమేహం నియంత్రణకు రోజూ 5 కి.మీ.ల మేర నడవటం చాలా ముఖ్యం.

- డా.శ్రీనివాస్‌రెడ్డి, ప్రముఖ ఫిజీషియన్

చెవిలో ఏది పడితే అది పెట్టకూడదు..



చెవి ద్వారా వినటమే కాదు దానితో పనులు జరుగుతాయి. అది చాలా సున్నితమైంది. చాలా మంది చెవిలో దురదగా అనిపిస్తే వెంటనే ఇయర్ బడ్స్, పుల్లలను పెట్టి అందులో ఉన్న వ్యర్థాలు బయటకు తీయడానికి ప్రయత్నిస్తారు. అలా చేయడం ఎంత మాత్రం మంచిది కాదు. వయస్సు పెరిగే కొద్దీ వినికిడి లోపాలు వస్తుంటాయి. ఈ సమస్యను అధిగమించేందుకు ప్రస్తుతం అనేక పరికరాలు అందుబాటులోకి వచ్చాయి. చిన్నపిల్లల్లో టాన్సిల్స్ వస్తుంటాయి. తర్వాత తగ్గిపోతాయి. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. చదువులో వెనకబడుతున్న చిన్నారుల్లో వినికిడి సమస్యలు కూడా ఉండే అవకాశం ఉంటుంది. పిల్లల్లో సమస్య ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే చికిత్సలు చేయించాలి. చిన్నారులు సపోటా, శీతాఫలాలు వంటివి తినే క్రమంలో వాటి గింజలు కూడా మింగే అవకాశం ఉంటుంది. అవి శ్వాస నాళికలోకి వెళ్లి అడ్డుపడితే ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉంటుంది. పసివాళ్లకు ఇలాంటి గింజలు అందుబాటులో ఉండకుండా పడేయాలి. నోటి క్యాన్సర్ రాకుండా నోటిని శుభ్రంగా ఉంచుకోవాలి. నోటిలో పుండు ఎక్కువ కాలం మానకపోతే ఈఎన్‌టీ వైద్యుడిని సంప్రదించాలి. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఈఎన్‌టీ విభాగంలో అత్యాధునిక వైద్య పరికరాలు అందుబాటులోకి తీసుకొచ్చాం. అన్ని రకాల చికిత్సలు అందిస్తాం. సద్వినియోగం చేసుకోవాలి.

- డా.సంపత్‌కుమార్ సింగ్, ఈఎన్‌టీ విభాగాధిపతి, జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్, మహబూబ్‌నగర్

బరువు పెరిగితే గుండెపై ఒత్తిడి..



బరువు అధికంగా పెరగడం వల్ల గుండెపై ఒత్తిడి పెరిగి హృద్రోగ సమస్యలు ఉత్పన్నమవుతాయి. ధూమపానం కూడా గుండె వ్యాధులకు దారితీస్తుంది. మహిళలతో పోలిస్తే గుండె జబ్బులు, మరణాలు పురుషుల్లోనే ఎక్కువ ఉంటాయి. రుతుస్రావం వల్ల మహిళలు ఆరోగ్యంగా ఉంటారు. నేడు అత్యాధునిక వైద్య సదుపాయాలు అందుబాటులోకి రావటంతో గుండెపోటు వచ్చిన వారిలో 99 శాతం మంది బతుకుతున్నారు. బొడ్డు పైభాగం నుంచి గొంతు కింది భాగం వరకు గతంలో వచ్చిన నొప్పి కాకుండా కొత్త రకమైన తీవ్రమైన నొప్పి వస్తే అది గుండెపోటుకు సంకేతంగా భావించి వెంటనే అప్రమత్తం కావాలి. ఆయాసం, కళ్లు తిరగడం, చెమటలు ఎక్కువగా రావడం తదితర లక్షణాలు కూడా కనిపిస్తాయి. గుండెపోటు వచ్చిన మూడు నిమిషాల్లో వారికి సీపీఆర్ ప్రారంభించాలి. వెంటనే డిస్ప్రిన్ టాబ్లెట్ నాలుక కింద పెడితే గుండెపోటు తీవ్రతను తగ్గించడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఆ వెంటనే సమీపంలో ఉన్న ఆసుపత్రికి తరలించి వైద్యులకు చూపించి చికిత్సలు ప్రారంభిస్తే ప్రాణాలను నిలబెట్టవచ్చు.

- డా.మహేశ్‌బాబు

దందా వెనక ఆ ముగ్గురు!

జీరో ఇసుక పేరుతో అక్రమం





తుమ్మిళ్ల రీచ్ వద్ద ఇసుక నిల్వలు

గద్వాల కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఆంధ్రప్రదేశ్‌లో జీరో ఇసుక పాలసీ సరిహద్దులోని గద్వాల జిల్లాలో కాసులు కురిపిస్తోంది. రెండు తెలుగు రాష్ట్రాలకు చెందిన ఇసుకాసురులు ఏకమై అధికారుల అండదండలతో జీరో ఇసుక పాలసీని ఇక్కడ యథేచ్ఛగా అమలు చేస్తూ రూ.కోట్లు దండుకుంటున్నారు. వెనుక గద్వాల జిల్లాకు చెందిన అధికారపార్టీ బడా నాయకుడి భరోసా, అధికారుల అండదండలు పుష్కలంగా ఉన్నట్టు సమాచారం. సరిహద్దు గుండా ఒక ఇసుక టిప్పర్ జిల్లాలోకి అడుగు పెడితే అధికార పార్టీ నేతలు నెలకు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి, అలంపూర్ పట్టణానికి చెందిన అధికార పార్టీ నాయకుడు, ఎర్రవల్లి చౌరస్తాలో ఓ యువకుడు ఇందులో ప్రధాన భాగస్వాములని తెలుస్తోంది.

అధికార పార్టీ నాయకుడి హస్తం : జిల్లాలో అధికారికంగా ఇసుక తవ్వకాలు జరగడం లేదు. ఇసుక తవ్వకానికి కాంట్రాక్టు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు అధికార పార్టీ నాయకుడికి మధ్య కమీషన్ల విషయంలో వివాదం ఏర్పడటంతో ఐదు నెలలుగా తవ్వకాలు నిలిచిపోయాయి. ఈ క్రమంలో మన ఇసుక, మన వాహనం కింద దరఖాస్తు చేసుకున్న వారికి ఇసుక దొరకడం లేదు. తుమ్మిళ్ల రిచ్ వద్ద 40వేల టన్నుల ఇసుక అంటే సుమారు 2 వేల టిప్పర్ల ఇసుక డంపుల రూపంలో అందుబాటులో ఉండటంతో, ఈ ఇసుక కోసం 150 టిప్పర్ల యజమానులు మన ఇసుక, మన వాహనం కింద ప్రభుత్వానికి సొమ్ములు చెల్లించి నెలలు గడిచినా అందడం లేదు. మరోవైపు సరిహద్దుల గుండా బ్లాక్ మార్కెట్లో ఇసుక సులభంగా దొరుకుతోంది. అధికారికంగా ఇసుక డంపులు అందుబాటులో ఉన్నా, నిర్మాణదారులకు ఎందుకు అందడం లేదో అంతు చిక్కని విషయం. ఈ తతంగం వెనుక బడానాయకుడి హస్తం ఉన్నట్లు బహిరంగంగానే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు మన ఇసుక, మన వాహనం కింద విక్రయించడానికి మీనమేషాలు లెక్కిస్తుండటం కూడా అనుమానాలకు తావిస్తోంది. మన ఇసుక, మన వాహనం కింద టన్ను ఇసుక రూ. వెయ్యి కాగా, బ్లాక్‌లో టన్ను ఇసుకను దళారులు రూ.2,800లకు విక్రయిస్తూ రోజూ లక్షలా ర్జిస్తున్నారనే నిర్మాణ రంగంలో ఉన్న పలువురు అంటున్నారు. గద్వాల పట్టణానికి రోజుకు 6 నుంచి 10 టిప్పర్లు (ఒక్కో టిప్పర్‌లో 30 నుంచి 42 టన్నులు) ఇసుక రవాణా అవుతోంది.

చేస్తున్నారు ఇలా..

తుంగభద్ర నది అవతలి వైపున ఉన్న కర్నూల్ పట్టణ శివారు ప్రాంతాల నుంచి కర్నూల్ పట్టణానికి చెందిన ఓ వ్యక్తి ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన వ్యక్తికి మధ్య ఉన్న అవగాహన ప్రకారం ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల నుంచి తెలంగాణ సరిహద్దు అయిన గట్టు మండలంలోని బల్గెర వరకు టిప్పర్‌ను తీసుకుని వస్తారు. అక్కడి నుంచి ధరూర్ మీదుగా గద్వాల పట్టణానికి ఆ టిప్పర్ చేరుకునే విధంగా పక్కా ప్లాన్‌తో సరఫరా చేస్తున్నారని సమాచారం. పదిహేను రోజుల కిందట ఇలా మంత్రాలయం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్‌ను ధరూర్ పోలీసులు పట్టుకున్నట్లు సమాచారం. కృష్ణానది అవతలివైపునున్న వనపర్తి జిల్లాలోని రంగాపురం, రాంపురం గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ఇసుక అక్రమంగా గద్వాల పట్టణానికి రవాణా జరుగుతోంది. ఎర్రవల్లి చౌరస్తాకు చెందిన ఓ యువకుడు ఇందులో కీలక సూత్రధారి. టీఎస్ఎండీసీ ప్రాజెక్టు అధికారి రంగారెడ్డి వివరణ కోసం సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

'బెటాలియన్లు కావు.. రాచరికపు బంధిఖానాలు'



ఎర్రవల్లిచౌరస్తాలో ర్యాలీ నిర్వహిస్తున్న పదో పటాలం పోలీసు కుటుంబాలు

ఇటిక్యాల, న్యూస్‌టుడే: 'ఇవి బెటాలియన్లు కావు రాచరికపు బంధిఖానాలు' అంటూ ప్రత్యేక పోలీసు కుటుంబాలు ఆందోళన వ్యక్తం చేశాయి. ఎర్రవల్లిచౌరస్తాలోని పదో పటాలంలో పనిచేసే పోలీసు కుటుంబాలలో కొందరు గురువారం సాయంత్రం ఒకే రాష్ట్రం.. ఒకే పోలీసు విధానం తీసుకురావాలంటూ ఎర్రవల్లిచౌరస్తాలోని జాతీయ రహదారిపై ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. 20 నిమిషాల పాటు జాతీయ రహదారిపై నిరసన తెలిపిన కుటుంబీకులకు ఇటిక్యాల, కోదండాపురం ఎస్ఐలు వెంకటేశ్, స్వాతి నచ్చచెప్పి నిరసన విరమింపజేశారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. నెలలో 26 రోజులు డ్యూటీలు వేస్తుండటంతో కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై పటాలంలో ఉన్నతాధికారులకు పలుమార్లు విన్నవించినా న్యాయం జరగలేదన్నారు. సివిల్, ఏఆర్‌లాగా ఒకే దగ్గర ఐదు సంవత్సరాలు డ్యూటీలు ఉంటూ కుటుంబాలను చూసుకునేలా మార్పులు తేవాలంటూ వారు డిమాండ్ చేశారు.

ఎగువ జూరాలలో సాంస్కృతిక పోటీలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ సూరిబాబు, చిత్రంలో సీఈ రామసుబ్బారెడ్డి

ఆత్మకూరు, న్యూస్‌టుడే: ఎగువ జూరాల జల విద్యుత్తు ఉత్పత్తి కేంద్రంలో గురువారం టీఎస్ జెన్‌కో రాష్ట్ర స్థాయి సాంస్కృతిక పోటీలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ పోటీలు కొనసాగుతాయి. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఉద్దేశించి జెన్‌కో సీఈ రామసుబ్బారెడ్డి, ఎస్ఈ సూరిబాబు మాట్లాడారు. ఉద్యోగులకు విధుల నిర్వహణతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఆయా ప్రాంతాలకు చెందిన పది విద్యుత్తు ఉత్పత్తి కేంద్రాల నుంచి 70 మంది అధికారులు, ఉద్యోగులు ఈ పోటీలకు హాజరయ్యారని తెలిపారు.

తెగిపడిన హెచ్‌టీ తీగలు

కాలిన ఫ్యాన్లు, మీటర్లు ● ఒకరికి గాయాలు




జావిద్ కాలికి గాయాలు



జక్లేర్‌లో దగ్ధమైన మీటర్లు

మక్తల్ గ్రామీణం, న్యూస్‌టుడే: హెచ్‌టీ విద్యుత్తు లైన్ తీగలు తెగి పడిన ఘటన మక్తల్ మండలం జక్లేర్ స్టేజీ వద్ద గురువారం తెల్లవారుజామున చోటు చేసుకుంది. జావిద్ ఇంటి ముందు ఉన్న హెచ్‌టీ లైన్ తీగలు తెగి ఎల్‌టీ లైన్‌పై పడిపోవడంతో షార్ట్ సర్క్యూట్ ఏర్పడింది. ఆ ప్రాంతంలోని నివాస గృహాల్లో 12 ఫ్యాన్‌లు, 10 విద్యుత్తు మీటర్లు కాలిపోయాయి. తీగపడిన క్రమంలో తూలిపడిన జావిద్‌కు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే విద్యుత్తు ఉపకేంద్రానికి సమాచారం ఇచ్చి, సరఫరా నిలిపివేయించారు. ఈ ఘటనపై విచారణ చేస్తామని విద్యుత్తు శాఖ ఏఈ రామకృష్ణ తెలిపారు.

ఇథనాల్ పరిశ్రమ పనులు అడ్డుకున్న ప్రజలు



పనులను అడ్డుకునేందుకు వచ్చిన గ్రామస్థులు

రాజోలి, న్యూస్‌టుడే: మా అభిప్రాయం తీసుకోకుండా ఇథనాల్ పరిశ్రమ ఎలా ఏర్పాటు చేస్తారంటూ పరిసర గ్రామాల ప్రజలు పనులను అడ్డుకున్న సంఘటన గద్వాల జిల్లా రాజోలి మండలంలో గురువారం చోటుచేసుకుంది. గాయత్రి సంస్థ వారు పెద్ద ధన్వాడ గ్రామ శివారులో రైతుల నుంచి 25 ఎకరాల వ్యవసాయ భూమిని కొనుగోలు చేసి పరిశ్రమ ఏర్పాటుకు సన్నద్ధమయ్యారు. పరిశ్రమ ఏర్పాటుకు తీసుకున్న భూమి పక్కనే దళితులకు ప్రభుత్వం ఇచ్చిన భూమి 152 ఎకరాలు ఉంది. వీటితో పాటు చుట్టుపక్కల రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారం రోజుల కిందట పరిశ్రమ పనులు చేపట్టేందుకు రాగా ఆయా గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తిరిగి గురువారం సంబంధిత సంస్థ వారు పరిశ్రమకు అవసరమైన విద్యుత్తు స్తంభాలను, జేసీబీ, టిప్పర్, కంకర తీసుకురావడంతో పాటు గుడారాలను ఏర్పాటుచేశారు. విషయం తెలుసుకున్న పెద్ద ధన్వాడ, చిన్న ధన్వాడ, నసనూర్, మాన్‌దొడ్డి, చిన్నతాండ్రపాడు, నౌరోజి క్యాంపు ప్రజలు సంఘటన స్థలానికి చేరుకుని పనులను అడ్డుకుని సంస్థ సిబ్బందితో వాగ్వాదం చేశారు. సీఐ టాటాబాబు, తహసీల్దార్ రాంమోహన్, ఎస్సై జగదీష్ ప్రజలను నిలువరించి మాట్లాడారు. సంస్థ వారు అనుమతులు చూపకుండా పనులు ఎలా చేపడతారంటూ అధికారులను ప్రశ్నించారు. కాగా పరిశ్రమ ఏర్పాటుకు తమకు అన్ని అనుమతులున్నాయని సంస్థ వారు తెలిపినప్పటికీ వాటిని చూపకపోవడంతో పనులు నిలిపి వేసి వెళ్లిపోవాలని డిమాండు చేశారు. సీఐ, తహసీల్దార్ సంస్థ ప్రతినిధులతో మాట్లాడి అనుమతులు చూపించి పనులు ప్రారంభించాలని సూచించగా వారు పనులు ఆపేశారు. పరిశ్రమ ఏర్పాటు చేయకుండా చూడాలని ఈ సందర్భంగా ప్రజలు అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

రాయపురం క్వారీలో పేలుళ్లు: ఇద్దరికి గాయాలు



రాయి తగిలి గాయాలు

గద్వాల, న్యూస్‌టుడే: గట్టు మండలం రాయపురం శివారులో 199 సర్వే నంబర్‌లో భారత మాల పనుల కోసం క్వారీలో పేలుళ్లు జరపగా పక్కనే పొలంలో పనిచేసుకుంటున్న ఇద్దరికి గాయాలయ్యాయి. బాధితుల కథనం మేరకు.. గురువారం సాయంత్రం 5 గంటల ప్రాంతంలో క్వారీలో పేలుళ్లు జరపటంతో బండరాళ్లు ఎగిసి పడి హరిజన తిమ్మప్ప కుమారుడు నవీన్, మరదలు పద్మమ్మకు గాయాలయ్యాయి. ఎలాంటి సమాచారం లేకుండా పేలుళ్లు జరపటంతో పక్కనే పొలంలో వ్యవసాయ పనులు చేసుకుంటున్న వారు గాయపడ్డారని గట్టు పోలీసు ఠాణాలో ఫిర్యాదు చేసినట్లు తిమ్మప్ప వివరించారు. పేలుళ్లకు అనుమతులున్నాయో లేదో తమకు తెలియదని, చుట్టు పక్కల రెండు కి.మీ. దూరం వరకు ప్రజలు, రైతులను అప్రమత్తం చేయాల్సిన బాధ్యత కంపెనీ ప్రతినిధులదని, ఆదేదీ చేయకుండా పేలుళ్లు నిర్వహించటం వల్లే ఇలాంటివి జరుగుతున్నాయని వారు వాపోయారు. ఈనెల 21 తేదీ నుంచి క్వారీలో బ్లాస్టింగ్ చేస్తున్నామని కంపెనీ ప్రతినిధులు సమాచారం ఇచ్చారని, సాయంత్రం 3 గంటల నుంచి ఐదు గంటల ప్రజలు అప్రమత్తంగా ఉండేలా సమాచారం ఇవ్వాలని ఆదేశాలు ఇచ్చామని తహసీల్దార్ సరితారాణి పేర్కొంటున్నారు.

ఆత్మహత్యకు యత్నించిన బాలిక మృతి

సీడ్ ఆర్గనైజర్‌పై కేసు

మల్దకల్, న్యూస్‌టుడే: బంగారం దొంగతనం చేసిందనే నెపంతో బాలిక (17)ను మల్దకల్ ఠాణాకు పిలిపించి విచారించగా ఆ అవమానం భరించలేక ఆమె పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన విషయం తెలిసిందే. కాగా బాలిక చికిత్సపొందుతూ గురువారం మృతిచెందింది. ఎస్సై నందికర్ తెలిపిన వివరాల ప్రకారం.. మల్దకల్ మండలం బిజ్వారం గ్రామానికి చెందిన బాలిక ఈ సంవత్సరం మార్చి నెల నుంచి గద్వాలలోని బండ్ల రాజశేఖర్‌రెడ్డి ఇంట్లో పనులు చేయడానికి చేరింది. ఆగస్టు నెలలో తన ఇంట్లో బంగారు గొలుసు పోయిందని దానిని బాలిక దొంగతనం చేసిందని అనుమానం వ్యక్తం చేసి అడిగారు. ఆ తర్వాత గొలుసు ఇంట్లోనే దొరికిందని చెప్పారు. తిరిగి అక్టోబరు 11న గొలుసు దొంగతనం చేసిందని మల్దకల్ ఠాణాలో రాజశేఖరరెడ్డి ఫిర్యాదు చేయగా పోలీసులు బాలికను, తల్లిని ఠాణాకు పిలిపించి విచారించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. బాలిక అవమానం భరించలేక బిజ్వారంలో పురుగు మందుతాగి ఆత్మహత్యకు యత్నించింది. చికిత్స నిమిత్తం గద్వాలకు అనంతరం కర్నూలుకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం బాలిక మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు. బాలిక తల్లి కవిత ఫిర్యాదు మేరకు సీడ్‌ఆర్గనైజర్ రాజశేఖరరెడ్డిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నందికర్ వివరించారు.

చికెన్ ధరలు

ఫాంరేటు	120–00
రిటైల్	142–00
డ్రెస్డ్	206–00
స్కిన్‌లెస్	234–00

EENADU e Classifieds

REAL ESTATE

LAND FOR SALE

నల్లరేగడి వ్యవసాయ భూమి 13 ఎకరాలు పుష్కలమైన సాగునీటి సదుపాయంతో తుమ్మెల గ్రామం, రాజోలి మండలం, జోగులాంబ (గద్వాల్) జిల్లా, తెలంగాణాలో అమ్మబడును. ✆ 92461 96829.

JOBS

కన్సల్టెన్సీ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీ/పు॥ ఆయా, నర్సులు, వంటవారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15-40 వేలు. ఫ్రీ రూమ్ + బో॥ Hyd. Ph: 9182260297.

Book Your 5 Lines Classified Advertisement for
B&W Rs. 335/- Only
Colour Rs. 395/- Only
GST 5% Extra
For further details Contact : Mahabubnagar 8008709794

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో ఈ వార్తా పత్రికకు ఏవిధమైన సంబంధం లేదు. ప్రకటనదారులు సరుకుల అమ్మకం లేదా అందించిన సేవల విషయంలో తప్ప, ప్రకటనల ద్వారా ప్రజల నుండి ఎట్టి డబ్బును వసూలు చేయరాదు. డబ్బును వసూలుచేసే ప్రకటనకర్తను బ్లాక్ - లిస్టులో ఉంచే మరియు / లేదా అతనిపై చట్టపరమైన చర్య తీసుకునే హక్కు యాజమాన్యానికి కలదు.

ఈనాడు
దినపత్రికలో అన్ని రకాల ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు
Cell:8008709794
ఈనాడు పత్రిక కోసం సంప్రదించండి
Cell:8008001824

(c) eenadu

మేమున్నాం.. ఉ॥ 10 గం. నుంచి మ॥ 1 వరకు
మీకు తోడుగా..
నాగర్‌కర్నూలు 7993300530
అచ్చంపేట 8008573927
కల్వకుర్తి 9908803650
కొల్లాపూర్ 8008573870

సమస్య : కొల్లాపూర్ పట్టణంలోని బాబూజగ్జీవన్‌రాం, జ్యోతిరావు ఫులే విగ్రహాల ప్రాంతాల్లో రహదారి విస్తరణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. **- శివవర్మ**

సమాధానం : నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపాం. రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడకుండా చర్యలు చేపడుతాం. **- శ్రీనివాసన్, కమిషనర్, కొల్లాపూర్ పురపాలిక**

సమస్య: నాగనూల్ బీసీకాలనీలో పూర్తిస్థాయిలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టకపోవడం వల్ల బురదలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారులు స్పందించి సీసీ రోడ్లు వేయాలి. **-రాజు, నాగర్‌కర్నూల్**


నాగర్‌కర్నూల్: బీసీ కాలనీకి వెళ్లే రహదారిపై బురద

సమాధానం: ప్రతి కాలనీలో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నాం. నాగనూల్ బీసీ కాలనీలో నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేశాం. **-నరేశ్‌బాబు, పుర కమిషనర్**

– న్యూస్‌టుడే, కొల్లాపూర్, కందనూలు

పుర అభివృద్ధికి కృషి: ఎమ్మెల్యే


ట్రాక్టర్లను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

అచ్చంపేట, న్యూస్‌టుడే : అచ్చంపేట పురపాలిక అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. గురువారం పురపాలిక ఆధ్వర్యంలో కొనుగోలు చేసిన రెండు ట్రాక్టర్లను ప్రారంభించి మాట్లాడారు. అంతర్గత దారులు, మురుగు కాల్వల ఏర్పాటుకు ప్రత్యేక నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం 2024-25 బడ్జెట్ సమావేశంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా ఛైర్మన్ గంగాపురం రాజేందర్, పుర ఛైర్మన్ శ్రీనివాసులు, కమిషనర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

క్రీడాకారులకు బహుమతుల అందజేత

మన్ననూరు(అమ్రాబాద్), న్యూస్‌టుడే : మండలంలోని మన్ననూరులో అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి ఎమ్మెల్యే వంశీకృష్ణ గురువారం బహుమతులు అందచేశారు. క్రీడాకారులను ప్రోత్సహించేందుకు మండలంలో ఓ మైదానం నిర్మిస్తామని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

చేపల పిల్లల విడుదల

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్) : మండలంలోని నల్లచెరువులో ఎమ్మెల్యే వంశీకృష్ణ మత్స్యశాఖ అధికారులతో కలిసి గురువారం చేప పిల్లలను వదిలారు. ఆయన మాట్లాడుతూ.. దళారులకు అవకాశం ఇవ్వకుండా చేపలను పట్టి ఆర్థికాభివృద్ధి సాధించాలన్నారు. జిల్లా మత్స్యశాఖ ఏడీ రజిని, మత్స్యకారులు వెంకటయ్య, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదు కాకుండా వివాదాలు పరిష్కరించాలి


పోలీసులతో మాట్లాడుతున్న న్యాయమూర్తి జ్యోత్స్న

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : చిన్న తగాదాలకు కేసులు నమోదు చేయకుండా, వాటిని పరిష్కరించేలా కృషి చేయాలని కొల్లాపూర్ జూనియర్ సివిల్ కోర్టు జడ్జి జ్యోత్స్న సూచించారు. గురువారం కోర్టులో బాధ్యతలు తీసుకున్న ఆమె ఎస్సైలు, ఆబ్కారీ పోలీసులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. చిన్న సంఘటనలకు కేసులు పెట్టుకొని కోర్టుల చుట్టూ తిరిగితే కలిగే ఇబ్బందులను వివరించారు. పాత కేసులను లోక్‌అదాలత్‌లో పరిష్కరించుకోవాలని సూచించారు. సీఐ మహేష్, ఎస్సైలు హృషికేష్, సతీష్, గోకారి, రామన్‌గౌడ్, ఆబ్కారీ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అధిక సాంద్రత పత్తి సాగు మేలు


రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త డా.ప్రభాకర్‌రెడ్డి

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : అధిక సాంద్రత పద్ధతితో పత్తి సాగు చేయడం వల్ల ప్రయోజనం ఉంటుందని పాలెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డా.ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం పాలెం కేవీకే ఆధ్వర్యంలో కొరటికల్, తిప్పాపూర్, తాడూర్ గ్రామాల్లోని రైతులకు పత్తి సాగు పద్ధతులపై అవగాహన కల్పించారు. అధిక సాంద్రత పద్ధతితో పంటకాలం తగ్గుతుందని, జిల్లాలో ఉన్న నేలలు ఈ విధానానికి అనువైనవని వివరించారు. కార్యక్రమంలో కీటక శాస్త్రవేత్త డా.శైల, రాజశేఖర్, ఆదినారాయణ, రామకృష్ణ పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలు అమలు చేయాలి : సీపీఎం

కల్వకుర్తి, న్యూస్‌టుడే: కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీల హామీని అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జాన్ వెస్లీ డిమాండ్ చేశారు. టీఎస్‌యూటీఎఫ్ పట్టణ కార్యాలయంలో గురువారం కల్వకుర్తి, ఊర్కొండ, వెల్దండ మండలాల ఏరియా కమిటీ మహాసభ జరిగింది. పార్టీ జెండాను జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు బాల్‌రెడ్డి ఎగరేశారు. సభలో జాన్‌వెస్లీ మాట్లాడుతూ గ్రామస్థాయి నుంచి ఆల్ ఇండియా కమిటీ వరకు పార్టీని పటిష్ఠం చేయాలని కోరారు. సమావేశంలో పర్వతాలు, ఆంజనేయులు, మల్లయ్య, బాలస్వామి, శ్రీనివాసులు, గుణమ్మ, రామకృష్ణ, శ్రీను, లక్ష్మీనారాయణ, పద్మ, భాగ్యలక్ష్మి, రజిత సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

మంత్రిని కలిసిన నిర్వాసితులు


మంత్రి జూపల్లి కృష్ణారావుతో ఎమ్మెల్యే వంశీకృష్ణ, నిర్వాసితులు

అచ్చంపేట గ్రామీణం, న్యూస్‌టుడే : నక్కలగండి ప్రాజెక్టు(ఎస్‌ఎల్‌బీసీ)లో ముంపునకు గురైన గ్రామాలు మర్లపాడుతండా, కేశ్యాతండాకు చెందిన నిర్వాసితులు గురువారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే వంశీకృష్ణను కలిశారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ వర్తింపజేయాలని కోరారు. వెంటనే నిర్వాసితులతో కలిసి ఎమ్మెల్యే మంత్రి జూపల్లి కృష్ణారావు నివాసానికి వెళ్లారు. బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అందించి న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. మంత్రి సానుకూలంగా స్పందించినట్లు నిర్వాసితులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామనాథం, భాస్కర్, దశరథ్ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మికులకు విముక్తి

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : మండల కేంద్రం నుంచి గోదల్ వైపు ఆటోలో పత్తి తీసేందుకు వెళ్తున్న ఐదు మంది బాల కార్మికులకు గురువారం విముక్తి కల్పించారు. బాల కార్మికుల సంరక్షణ కేంద్రం సమన్వయకర్త రేణుక, కోనేర్ సంస్థ సమన్వయకర్త అంజనేయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పుర కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కొల్లాపూర్ పట్టణం, న్యూస్‌టుడే : పుర కార్మికులకు రూ.26 వేల గౌరవ వేతనం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఈశ్వర్ డిమాండ్ చేశారు. పట్టణంలోని గురువారం పుర కార్మికుల నిరసనలో పాల్గొని మాట్లాడారు. కార్మికులు విధుల్లో ఉండగా మరణిస్తే ఎలాంటి పరిహారం ఇవ్వడం లేదన్నారు. సమస్యల పరిష్కారం కోసం ఈనెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. అనంతరం పుర అధ్యక్షురాలు మేకల రమ్యకుమారికి వినతిపత్రం అందించారు. రాము. ప్రసాద్, భగవాన్, రఘు, లక్ష్మి, చంద్రకళ, చిరంజీవి, కురుమయ్య, చెన్నమ్మ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన అవసరం


సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ గిరికుమార్

కందనూలు, న్యూస్‌టుడే: ప్రస్తుతం ప్రతి ఒక్కరూ సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ గిరికుమార్ అన్నారు. పట్టణంలోని ప్రయాణ ప్రాంగణంలో గురువారం సైబర్ నేరాలపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంకు ఖాతాకు సంబంధించిన వివరాలు అడిగితే ఎట్టి పరిస్థితిల్లో చెప్పవొద్దన్నారు. యువతీ, యువకులు సామాజిక మాధ్యమాలకు దూరంగా ఉండాలన్నారు.

గాలింపు చర్యలపై అసంతృప్తి

లింగాల, న్యూస్‌టుడే : మండలంలోని ఎర్రపెంట అడవిలో గత నెల 28న అదృశ్యమైన శంకర్ ఆచూకీ లభించకపోవడంపై రాష్ట్ర చెంచు లోకం అధ్యక్షుడు కాట్రాజు శ్రీనివాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. చెంచులు, నాయకులతో ఎర్రపెంటలలో గురువారం సమావేశమై మాట్లాడారు. అధికారులు, పోలీసులు నామమాత్రంగా గాలిస్తున్నారని, చెంచులు మాత్రమే సక్రమంగా వెదుకుతున్నారని చెప్పారు. వర్షాలకు కనీసం రక్షణ చర్యలు కూడా ఇవ్వడంలేదని విమర్శించారు. శుక్రవారం నుంచి ఎర్రపెంట చెంచులు బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేస్తామన్నారు. అక్కమ్మ, సన్నయ్య, మహేష్, మొగుతాలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ చేపట్టండి

కందనూలు, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ వేగవంతంగా అమలు చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి యాదగిరి డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. 30న జడ్చర్లలో ఎమ్మార్పీఎస్ ఉమ్మడి జిల్లా సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. నాయకులు విజయ్, రామకృష్ణ, నాగన్న, పరమేశ్, జగదీశ్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

అచ్చంపేట: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పుర ఛైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు అన్నారు. గురువారం పట్టణంలోని సాయినగర్ కాలనీలో పర్యటించి ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. వార్డు కౌన్సిలర్, నేతలు పాల్గొన్నారు.

తెరపై ఈనాడు
నాగర్‌కర్నూల్‌లో.. రవి: దేవర
కల్వకుర్తిలో.. పార్థసారథి: వెనమ్ ది లాస్ట్ డాన్స్, అశోక్ : విశ్వం

కూరగాయల ధరలు కిలో.. రూ.లలో



టమాటా 65, వంకాయ 60, బెండ 60, మిరప 90, కాకర 65, బీర 58, క్యాలీఫ్లవర్ 75, క్యాబేజీ 40, క్యారెట్ 64, దొండ 50, ఆలుగడ్డ 48, గోకర 64, దోస 45, ఆనంకాయ 18, చిక్కుడు 65, మునగకాయ 70, బీట్‌రూట్ 50, ఖీర, 45, బీన్స్ 95.

మొండి బకాయిలు చెల్లించాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని వివిధ స్వయం సహాయక మహిళా సంఘాలు తీసుకున్న రుణాలకు సంబంధించి మొండి బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీఎం బి.నిరంజన్ కోరారు. మండల సమాఖ్య కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. డిసెంబరు చివరి నాటికి మొత్తం బకాయిలు చెల్లించాలన్నారు.

మండలంలో 3,636 ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తులు


కొట్రలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను పరిశీలిస్తున్న అధికారులు

వెల్దండ, న్యూస్‌టుడే: ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు ప్లాట్లకు సంబంధించిన డాక్యుమెంట్లను వెంటనే అందజేయాలని ఎంపీవో లక్ష్మన్ కోరారు. మండలంలోని కొట్రలో ఎల్‌ఆర్‌ఎస్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్లాట్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు చెందిన లబ్ధిదారులు 3,636 దరఖాస్తులు చేసుకున్నారని తెలిపారు. వీటిలో 500కుపైగా నిషేధిత జాబితాలో ఉన్నాయన్నారు.

పాఠశాలలకే నేరుగా బియ్యం సరఫరా చేయండి


తహసీల్దార్ సునీతకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయులు

చారకొండ(వెల్దండ గ్రామీణం), న్యూస్‌టుడే: మధ్యాహ్నం భోజన పథకం కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న బియ్యాన్ని నేరుగా పాఠశాలలకు అందజేయాలని తహసీల్దార్ సునీతకు డీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. బియ్యంను ప్రతి నెల కల్వకుర్తిలోని స్టాక్ పాయింట్ నుంచి తెచ్చుకోవడం ఉపాధ్యాయులకు ఇబ్బందిగా మారిందన్నారు. నాయకులు రామస్వామి, పాండయ్య, రాజు, జగదీశ్వర్, మోతీరాం, సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాలో అంతరాయం

కల్వకుర్తి, న్యూస్‌టుడే: పట్టణంలో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలగనుందని ఏఈ శ్రీనివాస్ నాయక్ తెలిపారు. శుక్రవారం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యానగర్‌లోని సీపీఎం కార్యాలయం నుంచి యూకో బ్యాంక్, బొక్కలకుండ, కూరగాయల మార్కెట్, ఎల్లికల్ రోడ్డు, తిమ్మరాశిపల్లి, జేపీనగర్, రాంనగర్‌తండ, తిలక్‌నగర్, గాంధీనగర్, హైదరాబాద్ చౌరస్తా, సీకేఆర్ ఫంక్షన్ హాలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు కరెంట్ సరఫరా నిలిపేయనున్నట్లు వివరించారు.

సింగోటంలో నిత్యాన్నదానం ప్రారంభం


అన్నదానం చేస్తున్న ట్రస్టు సభ్యులు

కొల్లాపూర్, న్యూస్‌టుడే : కొల్లాపూర్ మండలం సింగోటంలో శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయ ఆవరణలో శ్రీశ్రీశ్రీ సద్గురు రామోహన్‌స్వామి ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నిత్య అన్నదానం ప్రారంభించారు. రోజూ మధ్యాహ్నం అన్నదానం ఉంటుందని ట్రస్టు సభ్యులు తెలిపారు. సోమశిలలో ఉన్న శ్రీలలితాంబిక సోమేశ్వరక్షేత్ర ప్రాంతంలో అన్నదానం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ట్రస్టుకు చెందిన రామోహన్‌స్వామి, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

అప్పాద్రి లక్ష్మీనరసింహస్వామి కొండపై చండీహోమం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే : మండలంలోని అప్పాజిపల్లి సమీపం అప్పాద్రి లక్ష్మీనరసింహాస్వామి కొండపై గురువారం చండీహోమం నిర్వహించారు. జోషి కృష్ణమూర్తి, గంగాధరశర్మ, హరిశర్మల ఆధ్వర్యంలో మూలవిరాట్టుకు అభిషేకాలు, అన్నప్రసాదాల వితరణ నిర్వహించారు.

అయోడిన్ ఉప్పునే వాడాలి

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: ప్రతి ఒక్కరూ అయోడిన్ కలిసిన ఉప్పునే వాడాలని వైద్యుడు ఇస్మాయిల్ సూచించారు. తిమ్మాజిపేటలోని కస్తూర్బా విద్యాలయం, బాలికల వసతిగృహం, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న ఉప్పును పరిశీలించి మాట్లాడారు. మధ్యాహ్న భోజనంలో తప్పకుండా అయోడిన్ కలిపిన ఉప్పునే వాడాలని అక్కడి ఏజెన్సీలకు వివరించారు. కార్యక్రమంలో బాలరాజు, మణికుమార్, చంద్రకళ పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం కల్పించాలని భక్తుల వినతి

లింగాల, న్యూస్‌టుడే : ప్రతి ఆదివారం నాయినేనిపల్లిలో ఉన్న మైసమ్మ అమ్మవారి ఉత్సవాలకు లింగాల నుంచి వెళ్లేందుకు బస్సు సౌకర్యం కల్పించాలని భక్తులు కోరుతున్నారు. బస్సులు లేక ప్రైవేట్ వాహనాల్లో వెళ్లాల్సి వస్తోందన్నారు. అచ్చంపేట, లింగాల నుంచి ఇక్కడికి రావడానికి ఆదివారం ప్రత్యేక బస్సులు నడపాలని కోరుతున్నారు.

ప్రారంభదశలోనే వ్యాధిని గుర్తించాలి

కందనూలు: కుష్ఠు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి వైద్యం అందించాలని జిల్లా ఉప వైద్యాధికారి వెంకట్‌దాస్ అన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖ, లెప్రా ఇండియా ఆధ్వర్యంలో ప్రత్యేకాధికారులకు, డాటా ఎంట్రీ సిబ్బందికి ఇచ్చిన శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. వ్యాధిని అరికట్టడానికి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలన్నారు. 2030 నాటికి వ్యాధిని అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రోగ్రాం అధికారి రవికుమార్, నరసింహస్వామి, కామేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం


సంఘం అధ్యక్షురాలిగా ఎన్నికైన గాయత్రికి నియామక పత్రం అందజేస్తున్న బాలరాజు

అచ్చంపేట, న్యూస్‌టుడే : ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పనిచేస్తున్న అతిథి అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించే వరకు పోరాటం చేస్తామని అతిథి అధ్యాపకుల సంఘం ఉమ్మడి జిల్లా కన్వీనర్ బాలరాజు అన్నారు. గురువారం కొండనాగుల శ్రీ ఉమామహేశ్వరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల అతిథి అధ్యాపకుల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా గాయత్రి, ప్రధాన కార్యదర్శిగా వెంకటస్వామి, కోశాధికారిగా ముంతాజ్ బేగం ఎన్నికయ్యారు. నేతలు డా.కొర్ర ఈశ్వర్ లాల్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

సెమీస్‌కు చేరిన జట్లు


కబడ్డీ ఆడుతున్న ఉయ్యాలవాడ, భూత్పూర్ జట్లు

కల్వకుర్తి పట్టణం, న్యూస్‌టుడే : కల్వకుర్తి పట్టణంలోని ఎంజేపీ బాలికల విద్యాలయంలో ఉమ్మడి జిల్లాస్థాయి క్రీడా పోటీలు కొనసాగుతున్నాయి. రెండోరోజు గురువారం వివిధ జట్లు సెమీస్‌కు చేరాయి. శుక్రవారం ఫైనల్స్ నిర్వహించి విజేతలకు బహుమతుల అందించనున్నారు. విద్యార్థులకు అన్ని వసతులు కల్పించినట్లు ప్రిన్సిపల్ నాగమణి, వ్యాయామ ఉపాధ్యాయురాలు సింధు తెలిపారు.

ఘనంగా ఉర్సు ఉత్సవాలు


దర్గాకు గంధం తీసుకువస్తున్న భక్తులు

ఊర్కొండ: మండల కేంద్రంలోని యుసుపోద్దిన్ దర్గా ఉర్సు ఉత్సవాలు బుధవారం రాత్రి ఘనంగా ప్రారంభమయ్యాయి. మండల కేంద్రంతో పాటు జకినాలపల్లి, ఊర్కొండపేట, తలకొండపల్లి మండలం గట్టుఇప్పలపల్లి గ్రామాల వారు ఊరేగింపుగా గంధం తీసుకువచ్చి దర్గాలో సమర్పించారు. గురువారం ఖవాలి నిర్వహించారు. షర్ఫుద్దీన్, అంజయ్య, జబ్బార్, ఫకృద్దీన్, షబ్బీర్, ఆరిఫ్, రఫీ, నయీం పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గ్యార్వీ వేడుకలు

కల్వకుర్తి: మార్చాలలో గురువారం గ్యార్వీ షరీఫ్ ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. దర్గాలో ముస్లింలు ప్రార్థనలు చేశారు. అనంతరం అన్నదానం చేశారు. మాజీ సర్పంచులు అల్వాల్‌రెడ్డి, కృష్ణయ్య, సునీత అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నిజామోద్దీన్, కృష్ణారెడ్డి, ఖాజామైనోద్దీన్, దాజుద్దీన్, ఖాదర్, షరీఫ్, సుధాకర్‌రెడ్డి, గౌసుద్దీన్ పాల్గొన్నారు.

విద్యా వ్యవస్థను మెరుగు పర్చాలి

కందనూలు, న్యూస్‌టుడే: జిల్లాలో పలువురు ఉపాధ్యాయులపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అధికారులు విద్యా వ్యవస్థను మెరుగుపర్చాలని తపస్ జిజిల్లా అధ్యక్షుడు రాజారెడ్డి కోరారు. ఆసంఘం ఆధ్వర్యంలో గురువారం డీఈవో కార్యాలయంలో గోవిందరాజులకు వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం ఉపాధ్యాయుల సర్దుబాటు చేపట్టాలన్నారు. అనంతరం ఉపాధ్యాయ సమస్యలపై చర్చించారు. శేఖర్, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, విజయరెడ్డి, భాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ, జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

తల్లీకుమార్తెల అదృశ్యం

తిమ్మాజిపేట, న్యూస్‌టుడే: మండలంలోని ఇప్పలపల్లికి చెందిన తల్లీకుమార్తెలు అదృశ్యమైన ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్సై నరేందర్‌రెడ్డి వివరాల మేరకు గ్రామానికి చెందిన స్వప్న(40), కుమార్తె సంజన(7) బుధవారం రాత్రి నుంచి కన్పించడంలేదు. చీకటిపడే వరకు ఇంట్లోనే ఉన్న ఇద్దరూ రాత్రి 9గంటల తర్వాత కన్పించకుండా పోయారు. కుటుంబీకులు గురువారం ఎంత వెతికినా ఫలితం లేకపోవడంతో తిమ్మాజిపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఐదుగురిపై కేసు నమోదు

వెల్దండ గ్రామీణం, న్యూస్‌టుడే: భూ వివాదంలో అన్నదమ్ములు ఘర్షణ పడ్డ ఘటనపై ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై కురుమార్తి కథనం ప్రకారం.. వెల్దండ మండలం రాచూర్‌కి చెందిన బాల్‌లింగం, సలేశ్వరం మధ్య కొంత కాలంగా భూ వివాదం ఉంది. గురువారం ఉదయం ఎస్సీ సామూహిక భవనం వద్ద ఘర్షణ పడటంతో ఇరువురికి గాయలయ్యాయి. ఈ ఘటనపై ఇరువురి ఫిర్యాదు మేరకు బాల్‌లింగం, కుమారుడు సాయికుమార్, సలేశ్వరం, చిన్నాన్న అంతయ్య, అతని భార్య జంగమ్మలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పంట ధ్వంసం చేసిన వ్యక్తిపై..

బల్మూర్ (అచ్చంపేట న్యూటౌన్), న్యూస్‌టుడే : గోదల్ గ్రామానికి చెందిన నర్సింహరెడ్డి వేరుసెనగ పంటను అదే గ్రామానికి చెందిన రాజేందర్‌రెడ్డి ధ్వంసం చేసిన ఘటనలో బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ చాంద్‌పాషా తెలిపారు. తన పొలంలో సాగు చేశాడని ఆరోపిస్తూ ఈ నెల 23న రాజేందర్‌రెడ్డి పంటను ధ్వంసం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేశామన్నారు.

నర్సరీల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలి

తెలకపల్లి, న్యూస్‌టుడే: మండలంలోని అన్ని గ్రామాల వారిగా రానున్న సంవత్సరానికి వెంటనే నర్సరీల ఏర్పాటుకు కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో శ్రీనివాసులు కోరారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో 6-7వేల వరకు మొక్కలు పెంచేందుకు ప్రణాళిక చేశామన్నారు. ఈ సారి అదనంగా మరో లక్షన్నర పైగా మొక్కలు పెంచడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. నర్సరీల్లో చింత, నేరేడు, సీతాఫలం, కానుగ, వేప లాంటి మొక్కలు పెంచేందుకు ప్రాధ్యానం ఇవ్వాలని సూచించారు.

'పేదలపై భారం మోపుతున్న కేంద్రం'


మాట్లాడుతున్న దేశ్యానాయక్

ఉప్పునుంతల, న్యూస్‌టుడే : కార్పొరేట్ సంస్థలకు రాయితీలు కల్పిస్తున్న కేంద్ర ప్రభుత్వం పేదలపై భారం మోపుతోందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎల్.దేశ్యానాయక్ ఆరోపించారు. గురువారం కాంసానిపల్లిలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. శాస్త్రీయ విద్యా విధానం తీసుకురావాలనే నిర్ణయాన్ని విరమించుకోవాలన్నారు. కార్యక్రమంలో మల్లేష్, శంకర్‌నాయక్, రాములు, శివకుమార్, చింతల నాగరాజు, శ్రీరాములు, హుస్సేన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

పెంట్లవెల్లి , న్యూస్‌టుడే : పెంట్లవెల్లి - పెబ్బేరు ప్రధాన రహదారిపై పోలీస్ స్టేషన్ ఎదుట ఎస్సై రామన్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం వాహనాలు తనిఖీ నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న చలానాలు కట్టించారు. ఏఎస్సై వెంకట్‌రెడ్డి, విష్ణు. రామస్వామి, రాంమూర్తి పాల్గొన్నారు.

అదుపు తప్పితే.. అంతే!

ఐదుగురు ప్రయాణించాల్సిన ఆటోలో 20-30 మంది వరకు ప్రయాణిస్తున్నారు. వ్యవసాయ పనులు ముమ్మరం కావడంతో కూలీల కొరత తీవ్రమైంది. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి నిత్యం వందలాది మంది ఆటోల్లో కూలి పనులకు రాకపోకలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డ్రైవర్లు ఆటో సామర్థ్యానికి మించి కూలీలను చేరవేస్తున్నారు. ఎక్కడయినా వాహనం అదుపు తప్పితే పెను ప్రమాదం జరిగే అవకాశం ఉంది. జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై పట్టణంలో ట్రాలీ ఆటోలో సుమారు 25 మంది కూలీలు ప్రయాణిస్తూ గురువారం 'న్యూస్‌టుడే' కెమెరాకు చిక్కిన వైనమిదీ..



–న్యూస్‌టుడే, కల్వకుర్తి పట్టణం

రహదారిపై ధాన్యం.. రాకపోకలకేది మార్గం

కొల్లాపూర్ మండలం సోమశిల వీఐపీ ఘాట్‌కు వెళ్లే రహదారిపై రైతులు ఇలా మొక్కజొన్న ధాన్యం ఆరబోశారు. ఆ దారిలో ఎలాంటి రాకపోకలు సాగించకుండా కట్టెలను ఉంచారు. దీంతో పర్యాటకులు కొంత మేర ఇబ్బంది పడ్డారు.

–న్యూస్‌టుడే, కోడేరు, కొల్లాపూర్



పొంచి ఉన్న ప్రమాదం




అచ్చంపేట పట్టణంలోని ఉపాధ్యాయుల కాలనీలో రహదారి పక్కనే ఉన్న విద్యుత్తు నియంత్రిక ఇది. ఇళ్ల మధ్య అతి తక్కువ ఎత్తులో ఎలాంటి రక్షణ కంచె లేకుండా ఇలా ప్రమాదకరంగా ఉంది. దీనికి తోడు చుట్టూ పిచ్చి మొక్కలు పెరిగాయి. రక్షణ చర్యలు ఏర్పాటు చేయాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

–న్యూస్‌టుడే, అచ్చంపేట

కొత్త స్తంభం వేశారు.. పాతది మరిచారు

కోడేరు మండలం నర్సాయిపల్లిలో 1972లో ఇనుప విద్యుత్తు స్తంభాలు పాతారు. అవి తుప్పు పట్టడంతో దాదాపు 30 సిమెంటు స్తంభాలను ఏర్పాటు చేశారు. అయితే పాత ఇనుప స్తంభాలను మాత్రం తొలగించలేదు. ఈ దృశ్యాన్ని గురువారం 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.



–న్యూస్‌టుడే, కోడేరు

(c) eenadu